కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 20, పచ్చిమిర్చి 50 , బెండ 40, కాకర 60, దొండ 40, దోస 40, ఆలు 30, చామ 60, కీర 40, బీర 60, వంకాయ 30, గోకర 60, బీన్స్ 100, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 40, చిక్కుడు 70, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (3) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 150.

తరలిన బీఆర్‌ఎస్ నాయకులు



రాయదుర్గం: బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభకు శేరిలింగంపల్లి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఖాజాగూడలో ఉదయం బీఆర్‌ఎస్‌పార్టీ పతాకాన్ని ఆవిష్క రించారు. అనంతరం బస్సుల్లో వరంగల్ సమావేశానికి బయలుదేరి వెళ్లారు.

పటాన్‌చెరు: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ఆదివారం పటాన్‌చెరు, ముత్తంగి, ఇస్నాపూర్ నుండి బీఆర్‌ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ ,పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా సభకు తరలివెళ్లారు.

నానక్‌రాంగూడలో 'మన్‌కీబాత్'



రాయదుర్గం: ప్రధానమంత్రి నరేంద్రమోడీ 'మన్‌కీబాత్' కార్యక్రమంను నానక్‌రాంగూడలో బీజేపీ గచ్చిబౌలి డివిజన్ నాయకులు, కార్యకర్తలు తిలకించారు. ఆదివారం నానక్‌రాంగూడలోని అధ్యక్షుడు శివాసింగ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు టీవీలో ప్రత్యక్షప్రసారాన్ని తిలకించారు.

నిత్యం యోగా చేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న యోగా గురువు నరేంద్ర బంధూజీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: యోగాతో ఆరోగ్యం కలుగుతుందని యోగా గురువు నరేంద్ర బంధూజీ అన్నారు. ఆల్విన్‌కాలనీ చివరి బస్టాప్‌లోని ఎంఎల్‌ఎన్ గార్డెన్స్‌లో నిర్మల సాధన జ్యోతి మందిర్ వార్షికోత్సవంను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగాసనాలు వేసి అబ్బురపరిచారు. అనంతరం గురూజీ నరేంద్ర బంధూజీ మాట్లాడుతూ ఉరుకుల, పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరు నిత్యం యోగా చేయాలని సూచించారు. చిన్నారులకు చిన్నతనం నుంచే యోగాపై ఆసక్తి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి ఇన్‌చార్జి చంద్ర శేఖర్, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం



రాయదుర్గం: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ సూచించారు. గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డిలోని రాహుల్ ఛాతి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఆస్పత్రి చైర్మన్, రాహుల్, సతీమణి నీలిమ, నాయకులు సీతారామరాజు, కృష్ణంరాజు, రమ, శ్రీనివాస్, ఆస్పత్రి వైద్యబృందం, స్థానికులు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

చందానగర్: చందానగర్‌లోని హుడా కాలనీ- 2 రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటి హాల్‌లో చందానగర్ మెడికవర్ హాస్పటల్స్ ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ఆదిత్య, డాక్టర్ నవీన్, విజన్ ఐ కేర్ డాక్టర్ శిరీషలు మాట్లాడుతూ నిత్యం వ్యాయామం, యోగ, ధ్యానం, నడక కనీసం 40 నిమిషాల పాటు చేయాలన్నారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ , కాలనీ అసోసియేషన్ నాయకులు రాజయ్య, రమణారెడ్డి పాల్గొన్నారు.

ఫ్రీ క్యాన్సర్ స్క్రీనింగ్..

చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్ పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డులోని శిరీష నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో ఫ్రీ క్యాన్సర్ స్క్రీనింగ్, ఉచిత మెగా మెడికల్ క్యాంప్ ను కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ ప్రారంభించారు.



దీప్తిశ్రీనగర్ కాలనీలో రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త



దీప్తిశ్రీనగర్ రేగులకుంట చెరువు పక్కన చెత్తచెదారం

ఎక్కడపడితే అక్కడ చెత్త

మియాపూర్: పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. బస్తీ, కాలనీలలో రోడ్ల పక్కన ఖాళీ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోతోంది. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో పేరుకుపోయి అకాల వర్షాలకు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతుంది. దీనికి తోడు దోమలు, ఈగలు స్వైర విహారం చేయడంతో పరిసర ప్రాంత ప్రజలు కంటి మీద కునుకు లేకుండా గడపాల్సిన పరిస్థితి దాపురించింది.

- మియాపూర్, చందానగర్ డివిజన్‌ల పరిధిలోని దీప్తిశ్రీనగర్, ఎంఏనగర్, ప్రశాంత్‌నగర్, స్టాలిన్ నగర్, పీఏనగర్, న్యూ కాలనీ, లక్ష్మీనగర్, ఏఎస్‌రాజు నగర్, బీకే ఎన్‌క్లేవ్, రెడ్డికాలనీ తదితర ప్రాంతాలలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయింది. అధికారుల పర్యవేక్షణలోపం, కాలనీలు, బస్తీలలో ఎక్కడపడితే అక్కడ చెత్త చెదారం వేయడంతో ఎటు చూసినా చెత్త కనపడుతోంది
- చందానగర్ సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్య సిబ్బంది కొరత, దీనికితోడు చెత్తను ఆటోరిక్షా వారికి ఇవ్వకుండా రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో వేస్తున్నారు. కొందరు రిక్షా కార్మికులు చెత్తను డంపింగ్ యార్డ్‌కు తీసుకుపోకుండా నిర్లక్ష్యంగా దీప్తీశ్రీనగర్‌లోని రేగులకుంట చెరువు, పటేల్ చెరువు , ఖాళీ ప్రదేశాల్లో వేస్తున్నారు.
- ప్రధాన రహదారులు, కూడళ్లలో, బస్టాప్‌ల వద్ద చెత్త వేసేందుకు తడి, పొడి డబ్బాలు కనిపించడం లేదు. లక్షల రూపాయలు ఖర్చుచేసి ఏర్పాటు చేసిన చెత్త డబ్బాలు విరిగిపోయినా తిరిగి ఏర్పాటు చేయడంలేదు.
- జీహెచ్‌ఎంసీ శానిటేషన్ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఎంఏనగర్ కాలనీ వద్ద ..



బీకేఎన్‌క్లేవ్ రోడ్డు పక్కన ..



ఏఎస్ రాజు నగర్‌లో ..

సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్ కాలనీలోని 'ఆల్ ఖైర్' సంస్థ పేద, మధ్య తరగతి మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తుందని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. గ్రాడ్యుయేషన్ డేను పురస్కరించుకొని ఆదివారం టైలరింగ్, మెహిందీ డిజైనింగ్, కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డితో కలిసి ఆయన సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. శిక్షణ మహిళలకు జీవనోపాధి కల్పించడంతో బాటు స్వశక్తితో ఎదగడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథ్‌రెడ్డి, మహ్మద్ ముషీర్ అహ్మద్, మహమ్మద్ వకీల్, మహ్మద్ బేగ్, అక్బర్ ఖాన్, యూసుఫ్ పాషా, నజీర్ ఖాన్, అక్తర్ ఖాన్, జుబేర్ బేగ్, నరేందర్ బల్లా పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



మంజూరు పత్రాలను అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు వరమని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ వి.జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. నల్లగండ్లలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 12 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ రూ. 5.95 లక్షలు మంజూరు పత్రాలను జగదీశ్వర్‌గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ లేబర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లా సంజీవరెడ్డి, నాయకులు వెంకటరావు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పటాన్‌చెరు టౌన్: పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి, 8మందిపై కేసు నమోదు చేసిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరులోని ఇంద్రేశం గ్రామ పరిధిలోని సూర్య వంశీ వెంచర్ బాలాజీనగర్‌లో పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారంతో ఆదివారం పోలీసులు దాడులు చేశారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.51,800 నగదు, 8 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నైపుణ్యాన్ని పెంచే డిజైన్‌తాన్



కోర్సువిటాలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

గచ్చిబౌలి: ఐటీ రంగంలో నైపుణ్యాన్ని పెంచి ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే 'డిజైన్‌తాన్'లో అనేక మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివారం కొత్తగూడలో కోర్సువిటా ఆధ్వర్యంలో డిజైన్ తాన్-2025 నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలలో మొదటిసారి నిర్వహించిన ఈ డిజైన్‌తాన్‌లో యుఐ, యుఎక్స్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్స్, వీడియో ఎడిటర్స్, సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్స్ ప్రతిభ చాటారు. కోర్సువిటా వ్యవస్థాపకులు అర్జున్ వినయ్ మాట్లాడుతూ పోర్ట్‌ఫోలియో బిల్డర్, జాబ్ సిమ్యులేషన్, క్విజ్‌విటా లాంటి సరికొత్త టెక్నాలజీలను ఆవిష్కరించామని తెలిపారు. డిజైన్ రంగంలో సృజనాత్మకత చాటుకునేందుకు విద్యార్థులకు డిజైన్‌తాన్ దోహదం చేస్తుందన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

అమరవీరుల సంస్మరణ సభ



నివాళులర్పిస్తున్న నాయకులు

మియాపూర్: ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని ఎంసీపీఐయూ రాష్ట్ర నాయకులు భాగ్యమ్మ, దానయ్యలు పిలుపునిచ్చారు. మియాపూర్ స్టాలిన్‌నగర్ ఎంసీపీఐయూ కార్యాలయంలో అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీ, నాగభూషణం, రాణి, స్థానిక నాయకులున్నారు.

జవహర్ బాల్‌మంచ్ రాష్ట్రస్థాయి సదస్సు



గచ్చిబౌలి స్టేడియంలో జవహర్ బాల్‌మంచ్ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

గచ్చిబౌలి: జవహర్ బాల్‌మంచ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి రిషికేష్‌రెడ్డి అధ్యక్షతన జవహర్ బాల్ మంచ్ రాష్ట్రస్థాయి పిల్లల శిక్షణా సదస్సును గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించారు. జవహర్ బాల్‌మంచ్ రాష్ట్ర కో ఆర్డినేటర్, ప్రోగ్రామ్ కన్వీనర్ జిట్టా సునీల్‌కుమార్ యాదవ్ సమక్షంలో ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సదస్సును జవహర్ బాల్‌మంచ్ జాతీయ అధ్యక్షుడు జివి హరి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మంచ్ జాతీయ ప్రతినిధి, రాష్ట్ర ఇన్‌చార్జీ ఫెన్ రస్సెల్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సదస్సులో మొట్టమొదటి జవహర్‌బాల్ మంచ్ ఎన్నికలు నిర్వహించి జాబితాను ప్రకటించారు. పిల్లల కమిటీ అధ్యక్షుడు సంతోష్, ఉపాధ్యక్షులు పునీత్, అంబటి సుచరితను ఎన్నుకున్నారు. ఈ సదస్సులో ముఖ్యంగా రాజ్యాంగం వాటి లక్ష్యాలు, ఆశయాలు, స్ఫూర్తిని, పంచాయతీరాజ్ వ్యవస్థ, స్థానిక సంస్థలు, పర్సనాలిటీ, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై పిల్లలకు అవగాహన కల్పించేందుకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంచ్ రాష్ట్ర అధ్యక్షుడు రిషికేష్‌రెడ్డి మాట్లాడుతూ జవహర్ మంచ్‌బాల్ మంచి పిల్లల యొక్క లక్ష్యాన్ని చేరుకోవడానికి ఒక సంధానకర్త పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లాల నుంచి తితిలి యూనిట్‌లోని పిల్లలు 200 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్లు శివరాజ్, ప్రవీణ్‌బాబు, కిరణ్, అంబటి తులసి, రాంబాయి, అభిషేక్, సాయికృష్ణ, బాల్యా నాయక్, సైదేశ్వరరావు, సుదర్శన్, సునీల్, విదుర్‌చావ్లా, వెంకటేష్ పాల్గొన్నారు.

వరి పరిశోధన కేంద్రం వార్షిక సమావేశం

ఏజీవర్సిటీ: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్(ఐసీఏఆర్) ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(ఐఐఆర్ఆర్) వరి పరిశోధన, వరిపై ఆల్ ఇండియా కోఆర్డినేటెడ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ వార్షిక సమావేశం ఆదివారం రాజేంద్రనగర్‌లో ప్రారంభమైంది. 3 రోజుల పాటు కొనసాగనున్న ఈ కార్యక్రమాన్ని ఐసీఏఆర్ డీజీ పరోడా ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ జానయ్య మాట్లాడుతూ దేశంలోనే నేడు తెలంగాణ మిగులు బియ్యం ఉత్పత్తి చేసే రాష్ట్రంగా ఉందన్నారు.ఐసీఏఆర్ డీటీ డీకే యాదవ్ మాట్లాడుతూ 1996 విత్తన చట్టం అమలులోకి వచ్చినప్పటి నుంచి దేశంలో 1500 వరి రకాలను విడుదల చేసినట్లు తెలిపారు.

అలరించిన నృత్యప్రదర్శనలు



మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం నృత్యోదయ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ గురువు డాక్టర్ ప్రసన్నరాణి శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. ఇందులో వినాయకకౌతం, శివ కౌత్వం, గోవర్ధన గిరిధారి, కళింగ నర్తన తిల్లాన, రాజరాజేశ్వరీ అష్టకం, జనుతశబ్దం, భామాకలాపం, కాలభైరవాష్టకం, వరవీణ, అష్టలక్ష్మి, నవదుర్గ అంశాలను కళాకారులు ధరణి, హిమన్య, జ్యోతి, ఉన్నతి, హైందవి, కృతిక, సాన్విక, ఆనందిని, ప్రాధాన్య, తరుణి, తన్వి, ప్రాలేఖ్య, గాయత్రి, పూరునిక, సుదీక్ష ప్రదర్శించారు. కార్యక్రమంలో హంస అవార్డు గ్రహీత డాక్టర్ సరళకుమారి, తెలుగు యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కోట్ల హనుమంతరావు, రాచకొండ కమిషనరేట్ డీసీపీ ఉష, డాక్టర్ ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



దాసరి నాగభూషణరావుకు నివాళులు



సీఆర్ ఫౌండేషన్‌లో నాగభూషణరావు చిత్రపటానికి నివాళ్ళు అర్పిస్తున్న వృద్ధాశ్రమ సభ్యులు

చందానగర్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ్యులు దాసరి నాగభూషణరావు వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం సీఆర్ ఫౌండేషన్‌లోని వృద్ధాశ్రమంలో ఆయన చిత్రపటానికి కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, ట్రెజరర్ చెన్నకేశవరావులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమ సలహా కమిటి సభ్యులు రాజేంద్రరావు, డాక్టర్ మండవ గోపిచంద్, తమ్మారెడ్డి తాన్యా, సీనియర్ పాత్రికేయులు ఏబికె ప్రసాద్, డాక్టర్ సరస్వతి, మల్లంపాటి వెంకటేశ్వరరావు, ఇందుకూరి రూపస్సీ, వెలుహోలు సాంబశివరావు, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు నివాళులర్పించారు.

ఉగ్రదాడి.. నిరసనలు



ఖాజాగూడలో నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

రాయదుర్గం: జమ్మూకశ్మీర్‌లోని పహల్గావ్‌లో అమాయకులపై ఉగ్రవాదుల దాడి అమానవీయమని బీఆర్‌ఎస్ శేరిలింగంపల్లి సీనియర్ నాయకుడు కొమిరిశెట్టి సాయిబాబా పేర్కొన్నారు. ఆదివారం ఖాజాగూడలో పహల్గావ్ మృతులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోకుల్‌ప్లాట్స్‌లో..

చందానగర్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గావ్ ఉగ్రదాడిని నిరసిస్తూ ఆదివారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్‌ప్లాట్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కాలనీ అధ్యక్షులు సాంబయ్య, సంజీవరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రసాద్, ప్రభాకర్, పితాని శ్రీను, దేవా, హరిబాబు , నాగమణి, లావణ్య, సుశీల తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



మియాపూర్: ప్రధాన రహదారుల వెంబడి మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా మారాయి. మియాపూర్ ఎంఏనగర్ కాలనీ రోడ్డులోని మ్యాన్‌హోళ్ల మూత ధ్వంసమయ్యాయి. కాగా నెల కిందట పాత వాటిని తొలగించి కొత్త మూతలు ఏర్పాటు చేశారు. నెల రోజులు కూడా గడవకముందే పరిస్థితి పునరావృతమవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. మూతలు పాడవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశముంది. అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ధ్వంసమైన మ్యాన్‌హోళ్ల వద్ద కర్రలు, ఇతర వస్తువులను సూచికలుగా ఏర్పాటు చేశారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆన్ చేస్తే సీజ్ చేస్తారు..

- కొనసాగుతున్న కరెంటు మోటార్ల సీజ్..
- నల్లాలకు మోటార్లు బిగిస్తే జరిమానాలు
- క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న ప్రత్యేక బృందాలు
- స్వచ్ఛందంగా తొలగించుకుంటున్న నివాసితులు



స్వాధీనం చేసుకున్న కరెంటు మోటార్లు

బంజారాహిల్స్: వేసవికాలంలో మంచినీటి సమస్యను పరిష్కరించడానికి జలమండలి చేపట్టిన మోటారు ఫ్రీ ట్యాప్ వాటర్ స్పెషల్ డ్రైవ్ ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రత్యేక బృందాలు కాలనీలు, హోటళ్లు, ప్రైవేటు హాస్టళ్లు, ఆస్పత్రి క్లినిక్‌ల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నాయి. జలమండలి డివిజన్-6 అధికారులతో పాటు సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొంటున్నారు. నల్లాకు మోటార్లు బిగించి మంచినీటిని తోడుతున్నట్లు తేలితే వారి కనెక్షన్ కట్ చేయడమేగాక రూ.5,000 జరిమానా విధిస్తున్నారు. ఇప్పటివరకు 88 మోటార్లను సీజ్ చేశారు. నీటి సరఫరాలో లో ప్రెషర్‌కు చెక్ పెట్టడమే లక్ష్యంగా ఈ డ్రైవ్ కొనసాగుతుంది. లైన్‌మెన్ నుంచి అధికారి వరకు ఈ నెల 15 నుంచి చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొంటున్నారు. వేసవిలో మోటారు ఫ్రీ ట్యాప్ వాటర్ లక్ష్యంగా నాలుగు దశల్లో తనిఖీలకు అధికారులు సిద్ధమయ్యారు. మంచినీటి సరఫరాలో లో ప్రెషర్‌కు చెక్ పెట్టి సాధారణ స్థాయి ఒత్తిడితో నీటి సరఫరా జరిగే విధంగా ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుండగా నల్లాలు వదిలినప్పుడు క్షేత్ర స్థాయిలో అధికారుల బృందాలు ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాయి.

మొదటి దశలో..

మొదటి దశలో లైన్‌మెన్లు వాటర్ వాల్వ్ తిప్పగానే సరఫరా చేసే లైన్లలో ప్రతి కనెక్షన్‌ను పరిశీలించి వాటర్ ప్రెషర్ ఎలా ఉందో తెలుసుకోవడమే కాకుండా మోటార్ల వినియోగాన్ని గుర్తిస్తున్నారు.

రెండో దశలో..

రెండో రోజు జలమండలి సెక్షన్ మేనేజర్ అదే ప్రాంతంలో పర్యటించి మోటార్లు బిగించినట్లు తేలితే రూ.5 వేల జరిమానా విధించి తక్షణమే మోటారు సీజ్ చేస్తున్నారు. ఆ ఇంటి క్యాన్ నెంబర్‌ను బ్లాక్ లిస్టులో పెడతారు. ఆ తర్వాత క్యాన్ నెంబర్ల జాబితాతో మోటారు ఫ్రీ ట్యాప్ వాటర్ లైన్లుగా జీఎం హరిశంకర్‌కు ఆన్‌లైన్‌లో నివేదిక సమర్పిస్తారు.

మూడో దశలో..

మేనేజర్ నివేదిక ఆధారంగా జీఎం క్షేత్ర స్థాయిలో వాటర్ లైన్లను ర్యాండమ్‌గా పరిశీలించి సంతృప్తి చెందితే సీజీఎంకు నివేదిక ఇస్తారు. అక్కడి నుంచి డైరెక్టర్, ఎండీ లాగిన్‌కు రోజువారీగా ఆన్‌లైన్ నివేదిక సమర్పిస్తారు.

నాలుగో దశలో..

ఈ నివేదికల ఆధారంగా క్రాస్ చెక్ కోసం జలమండలి ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ర్యాండమ్‌గా తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధిస్తూ మోటార్లు సీజ్ చేస్తారు.

తప్పుడు నివేదిక ఇస్తే మెమో..

మోటారు ఫ్రీ ట్యాప్ వాటర్ సర్వేలో సమగ్ర పరిశీలన జరపకుండా తప్పుడు నివేదిక సమర్పిస్తే మాత్రం సంబంధిత అధికారికి మెమో జారీ చేయాలని అధికారులు నిర్ణయించారు. అదేవిధంగా జలమండలి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసే డ్యాష్ బోర్డులో ఆన్‌లైన్ ఆధారంగా ప్రతిరోజూ నివేదికలను పరిశీలిస్తారు.

మొత్తంగా లైన్‌మెన్ నుంచి అధికారుల వరకు విజిలెన్స్ పోలీసులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ అక్రమంగా మోటార్ల ద్వారా నీటిని తోడుతున్న వారి జాబితాను రూపొందిస్తున్నారు. జరిమానాలతో పాటు నీటి కనెక్షన్‌ను కూడా కట్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. కాగా ఇప్పటికే చాలామంది తాము ఏర్పాటు చేసుకున్న మోటార్లను స్వచ్ఛందంగా తొలగిస్తున్నారు. ఈ వేసవి కాలం అయ్యేవరకు స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.